# వాస్తవం

''ఇన్నాళ్లయి, ఇన్నేళ్లయి, దీని కోసం చేసిన కృషిలో ఆవగింజంత భాగం ప్రయత్నంచేసి ఉంటే ఈ పాటికి బియ్యే పాసవకపోయి ఉండునా! అయినా నా అదృష్టం ఇంతేనేమో! నాకు మంచి గీతలేదు!''

సుహాసిని నిట్టూర్చింది.

ఇలా వాపోతూ ఉండడం సుహాకు కొత్తకాదు.

''పోనిద్దూ! ఉద్యోగమూ, పెళ్లీ... ఈ రెండేనా ఆడపిల్ల జీవితగమ్యాలు? చక్కగా, హాయిగా శ్రావ్యంగా పాడుకుంటూ ఉంటే చాలదూ? కలకాలం నీలో ఉండేది ఈ రసమాధురి. సంగీతం నేర్చుకోవడం, నిరంతరం సాధన చెయ్యడం విచారించడానికా? విషాదాన్నయినా.. బాధనయినా ఆనందంగా అనుభవించగలగాలి. త్యాగబ్రహ్మ జీవితం గుర్తు చేసుకో!''

సుహాసినికి తండ్రి ఈ మాటలూ కొత్తకావు. మూర్తిగారు విచారానికి, తాపత్రయానికీ అతీతుడు. దేనిలోనయినా ఆనందాన్ని స్వీకరించగలడు. సుఖంకంటే విలువైనది శాంతి. సుఖం కంటె నిత్యమైనది ఆనందం.

''నీకు పెళ్ళి కాలేదనీ, ఉద్యోగం రాలేదనీ కృంగిపోనవసరం లేదు. యోగం వచ్చేవరకు మనం చెయ్యగలిగిందేమీ లేదు. సృష్టి సర్వంలో సంగీతముంది. ప్రకృతి రసఝురి''

వ్యక్తిగా తనకయితే ప్రత్యేకంగా విచారమేమీ లేదు. కాని... చుట్టూ మనుషులు... తన ఆనందసాగరం తను మునిగిపోతే సరిపోతుందా? ఉద్యోగమూ లేక, పెళ్లికాక ఈడొచ్చి మీద పడిపోతున్న ఆడపిల్లలను - వాళ్ల మనసులలోని ఆరాటాన్నీ అర్థం చేసుకోగలిగిన సహృదయులెందరు?

''పోనీ నేను సంగీతం పాఠాలే చెబుతా! అలాగయినా నా విద్య, నా కృషి, నా సాధన సార్థకమవుతాయి.'' అంది తల్లితో సుహా.

తల్లి ఏమనుకోలేదు కాని తండ్రి సంగీతాన్ని అమ్ముకోవద్దన్నాడు. ఎవరింటికెళ్లి చెప్పినా సంగీతానికి ద్రోహం చేసినట్టే అవుతుందని ఆయన విశ్వాసం.

తండ్రి మాటకు ఎదురు చెప్పే లక్షణం సుహాలో లేదు. ఆవేశంలోనయినా తండ్రికి ఎదురాడలేదు.

తంబురా తీసి శృతి చూసుకుని ముఖారి ఆలాపన ప్రారంభించింది.

తలుపు ఎవరో కొడుతున్నారు. ఎక్కడో వింటున్నట్టు అనిపించింది. అమ్మాయి ఆలాపనతో పాటు మనసులో రాగాన్ని పాడుకుంటున్న మూర్తిగారికి.

మెల్లగా లేచి వెళ్లి చప్పుడు చెయ్యకుండా తలుపు తెరిచారు.

''అమ్మాయి పాడుకుంటోంది.... లోపలికి దయచెయ్యండి... అంబుజం...''

మూర్తిగారికి పరాయి ఆడవాళ్లతో మాటాడే అలవాటు లేనేలేదు. భార్యను వచ్చినావిడకు సంధానపరచి లోపలకు వెళ్ళిపోయారు.

ఆలాపన మధ్య స్థాయిలో నుంచి తారస్థాయిలోకి సంచరిస్తోంది. మూర్తిగారి కళ్లలో ఏదో వెలుగు. మనసులో ఏదో శాంతి... ఆర్ద్రత... మైమరపు. ఆనందంతో కంటతడి.

''ఏమండీ!'' అంబుజం పిలిచింది. అర్ధనిమీలిత నేత్రాలతో తన కంఠంలో ఉత్పన్నమవుతున్న రాగలహరిలో తేలిపోతున్న సుహావంక గోముగా చూసి ఆలాపన అవరోహణం మధ్యలో మూర్తిగారు

బయటకు వచ్చారు.

'' ఏమిటది ?''

'' ఆ ( ఏంలేదు మన వేదవతి గారు...''

''వేదవతి గారెవరు ?''

''అమ్మాయి వెళుతుంటుందే మహిళా సమాజం... దాని సెక్రటరీ...''

''వేదవతి గారు...''

''అమ్మాయిని పిలవమని రిక్షా ఇచ్చి పంపారు సమాజంలో సంగీతం పోటీలట... సుహా అంటే ఆవిడకు ఎంతో యిష్టం ! మీరు కోప్పడకపోతే ''

''వెర్రిదానా, నాకు కోపమెందుకు ? సుహా '' – రాగం కర్ణపేయంగా, మృదుమధురంగా మధ్యస్థాయిలోకి దిగుతోంది.

తండ్రి మూడవసారి పిలిచాక రాగాన్ని షడ్జమంలో నిలిపి తంబురా గోడకు చేరబెట్టినుంచుంది సుహా.

''పిలిచారా నాన్నా ?''

''అవునమ్మా, మహిళా సమాజం పోటీ వుందట... నీకు కబురొచ్చింది....''

''అవున్నాన్నా !.... కాని... నాకు పాల్గొనడం ఇష్టంలేదు. ప్రయిజు కోసం పాడడమా ? సంగీతం నేర్చుకుంటున్న వాళ్ల మధ్య సాధన చేస్తున్నదాన్ని నేనెందుకు పోటీ చెయ్యడం. నే వెళితే ఎంతమందికి కన్నెర్ర ?... తోటివాళ్ల అసూయ... నాకొద్దు నాన్నా... వాళ్లంతా ఉద్యోగాలూ, చదువులూ... సంసారాలతో సతమతమవుతూ సంగీతం నేర్చుకుంటున్నవాళ్లు.... నేను పోటీ చెయ్యడం న్యాయం కాదు. నే వెళ్లను''.

''అది కాదమ్మా... ప్రయిజు కోసం పాట అని ఎందుకనుకోవాలి. ఆవిడ ఎవరో వచ్చారు. నిన్ను తీసుకుని వెళ్లడానికి. ఇదిగో'' జేబుల్లోని, అల్మరాలోని వెతికివెతికి రెండు రూపాయల చిల్లర పోగుచేసి సుహాసనికిచ్చారు మూర్తిగారు.

'' ఒక్క నిముషంలో వస్తుందని చెప్పు.'' బయటకు వచ్చి ఈ మాటలు చెప్పి ఆయన గదిలోకి వెళ్లిపోయి ఆయన తంబురా శృతి చేసుకోవడంలో నిమగ్నమైపోయారు.

తండ్రి మాటకు ఎదురాడలేదు సుహా. అలాగే, ఆ చీరతోనే ముఖం ఒకసారి అద్దంలో చూసుకు బయలుదేరింది.

–రిక్షా దిగి క్లబ్బు ఆవరణలో అడుగుపెట్టింది.

'' ఏఁవమ్మా ! నోటీసులో సంతకం చేసి ఇంత ఆలస్యం... మరచిపోయావేమోనని ఆవిడను పంపాను...''

''లేదండీ :! సాధన... నాన్నగారు...'' మెల్లగా నీళ్ళునములుతూ అంది సుహా.

''క్లబ్బుకి వచ్చేవాళ్లే అంతంతమాత్రం... అందునా కర్ణాటక సంగీత పోటీలో పాల్గొనే వాళ్ళు నలుగురంటే నలుగురే ఉన్నారు. నువ్ వచ్చావ్... మిగిలిన వాళ్లు ఇంకా రావాలి.... మన మెంబర్ల ప్రతిభ మన కొత్త ప్రెసిడెంటుగారికి తెలియాలి... ఆవిడ ఈపాటికి వచ్చేస్తూ వుండాలి...''

''కొత్త ప్రెసిడెంటా ?''

''మహేశ్వరి గారికి బదిలీ అయి వెళ్లిపోయారుగా... ఈమారు జిల్లాకలెక్టరుగారి భార్య ప్రభావతి గారిని మనవాళ్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు... పాత ఆవిడ వెళ్లిపోయాక మొత్తం ఇటు ప్రెసిడెంటుపనీ, అటు సెక్రటరీ పనీనేనే చూసుకుంటూ, ఈ సంస్థని నడుపుకుంటూ వస్తున్నా... ప్రశ్నలేసేవాళ్లూ, పొద్దుపెట్టే వాళ్లేకాని పనికి ముందుకు వచ్చే వాళ్లెవరూ లేరు. అరుంధతి వచ్చింది ?... కోమల... జ్యోత్స్న... కలెక్టరు గారి భార్యకయినా తీరికవుతుందేమో, మనవాళ్లకు సరిగ్గా టైమ్‌కి వచ్చే అలవాటు లేదు... ఐదు కని పిలిస్తే ఏడవుతుంది వచ్చేసరికి...'' వేదవతిగారు విసుక్కున్నారు.

మరొక పావుగంటలో ఒకరూ ఒకరూ పోగయ్యారు.

న్యాయనిర్ణేత కోసం రిక్షా పంపుతూ వుంటే ప్రెసిడెంటుగారు రానే వచ్చారు.

''రండి. రండి ! మీ కోసమే చూస్తున్నాం. అందరూ వచ్చారు. జడ్జీగారికోసం రిక్షా పంపుతున్నాం!''

''సరే !... నేను బయలుదేరుదామని అరగంట నుంచి సిద్ధమైకూచున్నాను. ఆయన ఇంకా మేడ మీదే ఉన్నారు. కొంచెం ఆలస్యం అయింది. క్షమించండి !''

'' ఎంత మాట.... వీళ్లను పరిచయం చేస్తా... ఈరోజు పోటీలో పాల్గొనేవాళ్లు...''

పరిచయం చేశారు వేదవతి.

'' ఇవన్నీ ఎందుకులెండి. ఎవరెవరు ఎలా పాడతారో ఆవిడకు తెలిసిపోతుందిగా. తినబోతూ రుచెందుకూ ?''

-ముదురు నీలం కంచి పట్టుచీర - పచ్చని తెలుపు. నుదుట పెద్ద బొట్టు. మంచి ఒడ్డూ పొడుగూ - నిండైన విగ్రహం. వెయ్యి మందిలోనయినా చటుక్కున కనపడే ఆవిడ డాక్టరు గారి భార్య. ఆవిడ లోపలికి వస్తుంటేనే గదిలోకి అందమూ, దర్పమూ, చొరవా, నేర్పూ నాలుగూ కలిసి వస్తున్నట్టనిపిస్తుంది.

'' ఈవిడ డాక్టరుగారి సతీమణి. సునీలగారు. వీరు మన కొత్త ప్రెసిడెంటు గారు. శ్రీమతి ప్రభావతి. జిల్లాకలెక్టర్‌గారి సతీమణి''

''కార్డ్స్ అంటే మీకు ఇష్టమేనా ?'' సునీల ఆలస్యం చెయ్యలేదు.

''లేదండీ ! నాకు ఆ ముక్కల పేర్లు కూడా తెలియవ్'' ప్రభావతిగారు చిన్న ముఖం చేసుకుని చెప్పారు.

''అరెరె ! మీకెందుకు రెండు రోజులు. రెండంటే రెండే రోజులు చాలు. మా మేనకగారు నాకు మూడు రోజుల్లో నేర్పేశారు. ఆటంటే ఆవిడదండీ... మేనకగారు లెక్చరర్‌లెండి... చాలా సరదాగా ఉంటారు. ఓడిపోవడమనేది ఆవిడ నిఘంటువులో లేదు.

ప్రభావతిగారు శ్రద్ధగా వింటున్నారు. ఆమె ముఖంలో చిన్న ప్రశ్న తళుక్కుమంటుండగా చెప్పింది సునీల.

'' ఆవిడకి పెళ్లికాలేదు... సారీ ఆవిడ చేసుకోలేదు'' ఎవరి మానాన్న వాళ్ళు రెళ్ళుగా మూళ్ళుగా విడి మాటాడేసుకుంటున్నారు.

''రిక్షా వచ్చేస్తున్నట్టుంది. ఆయన సంగీత కాలేజీ ప్రిన్సిపాల్‌గారు...''

వేదవతి దిగ్గునలేచి గేటు దగ్గరకు పరిగెత్తారు. క్లబ్బులో నిత్యం ఏర్పాట్లను పర్యవేక్షించే

మీనాక్షిగారు వేదిక సిద్ధం చేసే ఉంచారు. మైక్ కనెక్షన్లు సవరించుకుంటున్నాడు ఎలక్ట్రీషియన్.

తంబురా శృతి చేసుకుంటోంది ఒక కాలేజీ ఈడు అమ్మాయి.

నాదం విని అటుపక్కకెళ్లింది సుహా.

''మీరు బాగా పాడతారట! నాకు వేదవతి గారు చెప్పారు. మీరు తంబురా తీసుకురాలేదా?'' సుహాసినిని అడిగింది ఆ అమ్మాయి.

''లేదు''

''నా తంబురా తీసుకోండి. మీదీ ఐదున్నరే కదా... క్లబ్బుకి ఎవరయినా తంబురా ఇస్తే బాగుణ్ణు.. మీరు పాడేటప్పుడు నేను శృతివేస్తా... నాకు మీరు వేస్తారుగా...'' ఆ అమ్మాయి ముఖంలో ఆప్యాయతకి ముగ్ధురాలైంది సుహా.

''నా పేరు జోత్స్న. మా నాన్నగారు జిల్లా అభివృద్ధి అధికారి. మొన్ననే ట్రాన్స్‌ఫర్ అయి ఇక్కడకు వచ్చాం. నాది సంగీతం గ్రూపు... అదృష్టంకొద్దీ ఈ ఊరొచ్చిపడ్డాం. సంగీతానికి విలువనిచ్చే ఊరు. సంగీతం అంటే అర్ధరాజ్యమిచ్చే ప్రభువుల విద్యల నగరం''

''నా పేరు సుహాసిని... కాలేజీకి వెళ్ళే అవకాశానికి నోచుకోలేదు''

''పోన్లెద్దురూ! సంగీతంకంటె విలువైనదింకేముంది! డిగ్రీలు కుక్కమూరకైపోయాయి. గంటకచ్చేరి చేయగలిగితే వందడిగ్రీల విలువ. ఈరోజుల్లో దాని విలువ తెలుసుకో...''

జ్యోత్స్న ముఖం వంకే చూస్తోంది సుహా. ఎంత సౌమ్యత! ఎంత అమాయకత్వం... ఎంత కలివిడి.

''మీరు ఏం పాడదామనుకుంటున్నారు?'' జ్యోత్స్న అడిగింది.

''మీరు చెప్పండి. అదే పాడతా... లేదా వాళ్లు ఏది పాడమంటే అది. నా ఇష్టమైనది పాడమంటారా, లేక వాళ్లు రాగం చెబుతారా?''

'' ఏమో నాకిష్టమైనది పాడమనడమే న్యాయం అలా అయితే నేను హిందోళ పాడతా! సామజవరగమనా పాడుతుంటే నాకు ఏదో ఉత్సాహపు వెల్లువలో గుర్రపుస్వారీ చేస్తున్నట్టుంటుంది. దయచేసి మీరు కాంభోజ పాడండి. 'మా జానకీ చెట్టబట్టగా' మీ నోట వినాలని కోరిక. కాదనకండి. ప్లీజ్!''

''సరే, చూద్దాం''.

వేదవతిగారు వేదిక మీదకు కాగితం పుచ్చుకుని బయలుదేరారు.

జడ్జీగా వచ్చిన సంగీత విద్వాంసులు వేదికకు ఎదురుగా ఆసీనులయ్యారు.

కొద్ది అడుగుల వెనుకగా వరసల్లో వేసిన కుర్చీలలో మహిళా సమాజం సభ్యులు ఆసీనులయ్యారు.

వేదవతిగారు పోటీ నిబంధనలను వివరించారు. ఎవరికిష్టమైన రాగం వారు పాడవచ్చు. కీర్తన ఏదయినా కావచ్చు కర్ణాటక సంగీతబాణీలోనే ఉండాలి. పదిపన్నెండు నిముషాలు కాలవ్యవధి... మొదటి పేరు కుమారి సుహాసిని.

సుహాసిని వేదిక మీదకు వెళ్లింది. వెనకనే జ్యోత్స్న వచ్చింది తంబురాతో.

స్ఫుటంగా స్ఫురించేటట్టు ఒక రెండు నిముషాలలో రాగాన్ని ఆలాపించి 'మా జానకీ చెట్టబట్టగా' అన్న కీర్తన అందుకొని హృద్యంగా నెరవు చేసి స్వరలాహిరిలో తేలి సరిగ్గా పదిన్నర నిముషాలలో

కీర్తన ముగించింది సుహాసిని.

ఆమె స్వరాలు వేస్తున్నంత సేపూ తదేకంగా సుహాసిని వంకే చూస్తున్న ప్రభావతి, పక్కన కూచున్న మేనకగారినడిగింది.

'' ఎవరీ అమ్మాయి ?''

''సుహాసిని ఆ పంతులుగారమ్మాయి సంగీతం చెబుతారాయన...''

మరేమీ అడగలేదు ప్రభావతి.

రెండవ వ్యక్తి పాడుతుండగా సెక్రటరీ వేదవతిగారిని సంజ్ఞ చేసి పిలిచింది.

''మీరు ఏమీ అనుకోకపోతే... సుహాసినిని మా బంగళాకి ఒకసారి పంపించండి. ఆ అమ్మాయి చేత పాడించి నేను రికార్డు చేసుకుంటా. నాకు సంగీతం ఏమి రాదనుకోండి. నేను ఎప్పుడూ నేర్చుకోలేదు. వినడమంటే నాకు సరదా... ఆ అమ్మాయి చాలా హాయిగా పాడింది... మా వారికి, తీరిక వుండదుకాని, వారికీ సంగీతమంటే ఇష్టమే...''

–వేదవతిగారి కళ్లలో ఓ వింతైన ఆశ జిగేల్‌మని మెరిసింది.

సుహాసినికి సహాయపడడానికి ఇది మంచి తరుణం, సుహాసిని పాట ఆవిడకు చాలా చాలా నచ్చింది.

కలెక్టరు గారి భార్య తలచుకుంటే, ఆవిడ చెయ్యాలనుకుంటే చెయ్యలేనిదేదీ వుండదు.

''తప్పకపంపుతా !... కాని.... మీరు రికార్డు చేసుకోడానికి ఆ అమ్మాయి మీ బంగళాకు రానవసరం లేదు. నేను ఇప్పుడే ఇంటి నుంచి నా టేపురికార్డరు తెప్పిస్తా... ఇక్కడే ఈ హడావుడి తరువాత ఆ అమ్మాయి చేత పాడిద్దాం...''

''కాదులెండి. మా ఇంటిలో పాడించుకోవాలని నా సరదా... అంతే... ఆ అమ్మాయికి రావడానికి అభ్యంతరమా ?''

–నాకెలా తెలుస్తుంది అనాలనుకున్నా, ప్రపంచం సంగతి తెలిసిన వేదవతి నిగ్రహించుకోగలిగింది.

''సరే చెబుతా !''

–'' ఏమిటీ, కలెక్టరుగారి భార్య ఏవో అడుగుతున్నారు !'' సునీల అడిగింది కాస్త సందు చేసుకుని.

''సుహాసిని బాగా పాడిందట....'' ఆ తరువాత ఎలా చెప్పాలో తెలియక తికమకపడింది సెక్రటరీ.

'' ఆహాఁ ! అలాగా ! సుహాసిని కంటె జానకి డిడీ ఓ గారవమ్మాయి చాలా బాగా, చురుకుగాపాడుతుంది. కాలేజీలో బియ్యే చదువుతోంది.... కారులో వాళ్ల ఇంటికి వెళ్లగలదు... నే చెబుతా ప్రభావతిగారికి...'' ఈ మాటలనేసి చటుక్కున సునీల మూతిముడుచుకుంది.

పోటీ ఫలితాలు ప్రకటించడం జరిగింది. జ్యోత్స్నకి మొదటి బహుమతి వచ్చింది.

సునీల వంక ఓరగా, ఎర్రగా చూసింది వేదవతి. సునీల ఉత్సాహంగా మాటాడేస్తోంది ప్రభావతితో.

రెండో బహుమానం సుహాసినికి వచ్చింది.

వాళ్లందరూ పేకాటలలో స్థిరపడ్డాక, ప్రభావతి కారు వెళ్లిపోయాక వేదవతి సుహాసినితో ప్రభావతి గారి ఆహ్వానం గురించి చెప్పింది.

''నాన్నగారేమంటారో !'' అని మాత్రం చెప్పింది సుహాసిని.

ఇంటికెళ్లి అసలు ఈ విషయం తల్లితండ్రులతో చెప్పిందో లేదో తెలియదు. వేదవతి మనసు మాత్రం కలుక్కుమంది.

బంగళాకి వెళ్లాలంటే ఆడపిల్ల - ఒక్కతెకీ ఎలా సాధ్యమవుతుంది ! రిక్షా మీద వెళ్లాలి. అంటే రానూపోనూ ఎనిమిది రూపాయలయినా అవుతుంది. పోనీ తను తీసికెళితే ?

ఆలోచించి ఆలోచించి మరుసటిరోజు సాయంకాలం బంగళాకి ఫోన్ చేసింది వేదవతి.

'' ఓహ్ ! సరేననుకోండి... ఈ మారుమరొక సారెప్పుడయినా చూద్దాం. ఈరోజే ఆ కాలేజీ అమ్మాయి వచ్చి పాడింది. ఒక టేపు పూర్తిగా రికార్డు చేశాను. ఆ అమ్మాయిని మరొకసారి పంపించవచ్చులెండి ! మరేమిటి విశేషాలు ?''

ఫోన్‌లో అడిగింది ప్రభావతి.

–సునీలను ఏమనాలో, ప్రభావతిగారిని ఎలా ఊహించాలో, న్యాయనిర్ణేతగా వచ్చిన ప్రభుత్వ సంగీత కళాశాల ప్రిన్సిపాల్‌గారిని ఏం చెయ్యాలో తెలియక తికమకపడిపోయారు వేదవతిగారు.

–సుహాసిని తండ్రితో తనకు ఏ బహుమానం వచ్చిందీ చెప్పలేదు. ఆయన అడగనూలేదు.

జ్యోత్స్నకు మంచి భావి ఉందని మాత్రం సుహా అనుకుంది.

**స్వాతి సపరివార పత్రిక**

15-3-85